W W W.EPAPER.MAHADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
26-8-2025





02

## మూడు వేలు కొట్టు రేషన్ కార్డు పట్టు

### పేట్రేగుతున్న రేషన్ కార్డు దందా

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పేదల రక్తం పీల్చే రేషన్ కార్డు మాఫియా దందా రోజురోజుకూ విస్తరిస్తోంది. అర్హులైన పేదలకు ఉచితంగా అందించాల్సిన రేషన్ కార్డులను ఇప్పుడు "మూడు వేలు కొట్టు - రేషన్ కార్డు పట్టు" అనే నినాదంగా మార్చేశారు.




04

## సైబర్ నేరాలకు పాల్పడుతున్న 13 మంది అరెస్ట్

### జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

గత రెండు రోజుల క్రితం ఎన్ సి ఆర్ పి (నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్) ద్వారా జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అందిన ఫిర్యాదుల మేరకు టేకులపల్లి పోలీసులు మరియు జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు సంయుక్తంగా ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.



03

## కూతుళ్ల కబుర్లు కన్నీటి శవపేటికల్లో

### రమ్య, ప్రసన్న, నాగలక్ష్మి ...
### పేర్లు మారినా వేదన అదే!

ప్రేమలో మోసం పెళ్లిలో కట్నం కుటుంబాల్లో అవగాహన లోపం ఇవన్నీ కలిసిపోయి ఈ రోజుల్లో అనేక మంది యువతుల ప్రాణాలను బలి తీసుకుం టున్నాయి. ఒక కూతురు కన్నీటిలో మునిగి చనిపోతే, ఒక తండ్రి గుండె చీలిపోతే, ఒక తల్లి చేతుల నుంచి రక్తం జారిపోతే ... అది కేవలం ఒక కుటుంబం విషాదం కాదుబీ అది మొత్తం సమాజానికి గట్టి హెచ్చరిక. అయినా ఈ సంఘటనల నుంచి మనం నేర్చుకోవడంలేదు. ఇదే అత్యంత దురదృష్టం

# డెలివరీ దందాకు చెక్!



## ఇక సిలిండర్‌కి అదనపు ఛార్జీలు లేవు

- 2. 5 కి.మీ. లోపు డెలివరీ ఉచితమే
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే 8.20 లక్షల కనెక్షన్లు
- ప్రతి సంవత్సరం కోట్ల రూపాయల ఆదా
- వినియోగదారుల ఊరట

07

ఎల్‌పీజీ ధరలు పెరగడంతో వినియోగదారుల జేబులు చించుకుపోతున్న తరుణంలో, డెలివరీ సిబ్బంది వసూలు చేసే అదనపు డబ్బులు మరింత భారమయ్యాయి. చిన్న కుటుంబాలకు ఒక్కోసా రి అదనపు రూ.50 కూడా పెద్ద బరువుగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవడంతో వినియోగదారుల హృదయాల్లో ఊరట పుట్టింది. ఇకపై ఇంటికి సిలిండర్ డెలివరీ చేసే సందర్భంలో బిల్లులో ఉన్న మొత్తం తప్పించి ఒక్క పైసా కూడా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ నిర్ణయం వల్ల ఖమ్మం జిల్లాలోనే కోట్ల రూపాయల మేర వినియోగదారులు లాభపడను న్నారు.



### ఖమ్మం జిల్లాలో గణాంకాలు

జిల్లాలో మొత్తం 33 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,20,713 కనెక్షన్లు కొనసాగు తున్నాయి. అందులో 2,14,988 సింగిల్ సిలిం డర్ కనెక్షన్లు, 1,03,876 డబుల్ సిలిండర్ కనెక్షన్లు, దీపం పథకం ద్వారా 78,456 కనెక్షన్లు, సీఎస్ఆర్ పథకం కింద 23,393 కనెక్షన్లు ఉన్నాయి. అదేవిధంగా భద్రాది కొత్తగూ డెం జిల్లాలో మరో నాలుగు లక్షల కలెక్షన్లు ఉన్నాయి.

### కోట్ల రూపాయల ఆదా

ప్రతి సిలిండర్ డెలివరీపై రూ.50 వసూలు చేస్తే 8.20 లక్షల కనెక్షన్లకు ఒక్కసారిగా రూ.4.10 కోట్లు ఆదా అవుతుంది. ప్రతి కుటుంబం నెలకు ఒక సిలిండర్ వాడుతుందనుకుంటే సంవత్సరానికి ఈ మొత్తం రూ.50.20 కోట్లు వరకు పెరుగుతుంది. ఇది నేరుగా వినియోగదారుల జేబుకే మేలు చేయనుంది.



08

## మణుగూరు ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

ఖమ్మం జిల్లా మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎస్కే సైదులు సాహెబ్ ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే, సైదులు సోమవారం ఖమ్మం నగరంలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయానికి వెళ్లి తన సమస్యలను వివరించారు.



08

## 39 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి

పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో బాధ్యతలు నిర్వహించి నిరంతరంగా సేవలందించి హెడ్ కానిస్టేబుల్ గా ఉద్యోగన్నతి పొందిన కానిస్టేబుళ్లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం పోలీస్ కమిషనర్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు.



# మూడు వేలు కొట్టు రేషన్ కార్డు పట్టు

## ఉమ్మడి జిల్లాలో పేట్రేగుతున్న రేషన్ కార్డు దందా

- రెవెన్యూ-మీసేవ సిబ్బంది కుమ్మక్కు బహిర్గతం
- కార్యాలయాల చుట్టూ తిప్పి దోపిడీ ఆటలు
- ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకున్న అధికారులు

ఖమ్మం మహా

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పేదల రక్తం పీల్చే రేషన్ కార్డు మాఫియా దందా రోజురోజుకూ విస్తరిస్తోంది. అర్హులైన పేదలకు ఉచితంగా అందించాల్సిన రేషన్ కార్డులను ఇప్పుడు "మూడు వేలు కొట్టు - రేషన్ కార్డు పట్టు" అనే నినాదంగా మార్చేశారు. రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేసే కంప్యూటర్ సిబ్బంది, మీ సేవా నిర్వాహకులు, స్థానిక నాయకులు వరకు ఈ అక్రమ వసూళ్ల ర్యాకెట్‌లో భాగమవుతుండటంతో ప్రజల్లో ఆగ్రహం ఉధృతమవుతోంది. కార్డుల కోసం నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయాలు, పౌరసరఫరాల శాఖల చుట్టూ తిరిగే ప్రజలను అధికారులు ఉద్దేశపూర్వకంగా తిప్పేస్తున్నారు. దరఖాస్తులు పెండింగ్లో పెట్టి, చివరికి "లంచం లేకుండా ఒక్క అడుగు ముందుకు కదలదు" అన్న రీతిలో వసూళ్లు చేస్తున్నారు. మీ సేవా కేంద్రాల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రభుత్వం ఖరారు చేసిన ఫీజులను ఎవరూ పట్టించుకోకుండా, మూడింతల-ఐదింతల వరకు వసూళ్లు చేస్తున్నారు. ఇటీవల ఖమ్మం నగరంలో ఒక మీసేవ నిర్వాహకుడు బహిరంగంగానే "రూ.3 వేలు ఇస్తే కొత్త కార్డు ఇప్పిస్తాను" అని డిమాండ్ చేసిన ఘటన, ప్రజల కోపాన్ని రగిలించింది. బాధితుడు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా పలుమార్లు ఫిర్యాదులు చేసినా, పై స్థాయి అధికారుల నుంచి ఎలాంటి ప్రతిస్పందన లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది.

### ప్రజల బలహీనతలపై అధికారులు ఆట

రేషన్ కార్డు లేకపోతే పేదలకు సంక్షేమ పథకాలు అందవు. ఈ బలహీనతను బాగా తెలిసిన అధికారులు, స్థానిక నాయకులు "మేమే ఇప్పిస్తాం" అంటూ కార్డుల కోసం తిప్పే ప్రజలను మోసం చేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం అర్హులందరికీ కార్డులు అందిస్తామని హామీ ఇస్తుంటే, మరోవైపు అదే కార్డులు "డబ్బు ఇస్తేనే లభించే పత్రం"గా మారాయి.

### 'మీ సేవా'.. ప్రజల రక్తం పీల్చే కేంద్రాలు

ప్రజలకు సులభంగా ప్రభుత్వ సేవలు అందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రాలు, ఇప్పుడు దోపిడీ కేంద్రాలుగా మారిపోయాయి. ఏ ధ్రువపత్రం కావాలన్నా, ఏ దరఖాస్తు పెట్టుకున్నా "ముందు డబ్బు %–% తర్వాత సేవ" అనే పద్ధతి అమలు అవుతోంది. ప్రభుత్వం ఖరారు చేసిన రేట్లు బోర్డులపై ప్రదర్శిస్తున్నప్పటికీ, వాస్తవానికి మాత్రం మూడింతలు వసూలవుతున్నాయి. ఇక ప్రజల్లో వినిపిస్తున్న ఆరోపణలు మరింత కలకలం రేపుతున్నాయి. మీ సేవా నిర్వాహకులు – ఈడీఎంల మధ్య నెలనెలా "ఖర్చులు" పేరుతో లావాదేవీలు జరుగుతున్నాయన్న మాటలు వినిపిస్తున్నాయి. అంటే, కింద స్థాయి వసూళ్లు పై అధికారులకు చేరుతున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి.

### ప్రభుత్వం స్పందించాలన్న డిమాండ్

ప్రజల మాట ఏకగ్రీవం – "ప్రభుత్వం నిజంగా పేదల పక్షాన నిలబడాలంటే ముందుగా రేషన్ కార్డు మాఫియాను అరికట్టాలి. మీ సేవా కేంద్రాల దోపిడీని తక్షణమే ఆపాలి" అని. లేకపోతే, ఈ మాఫియా మరింత విస్తరించి పేదలపై భారమవుతుందని ప్రజలు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. ఒక రేషన్ కార్డు కోసం రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూళ్లు జరుగుతుంటే, ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండటం అసహనాన్ని రేకెత్తిస్తోంది. పేదలు తమ హక్కు కోసం అడుగుతుంటే, అధికారులూ %–% నాయకులూ దాన్ని డబ్బుల వసూళ్ల పథకంగా మార్చేయడం నిజంగా దారుణం.

### మాఫియాను అరికట్టకపోతే

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రేషన్ కార్డు మాఫియా పెరుగుతున్న వేళ, ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోకపోతే పరిస్థితి అదుపు తప్పే ప్రమాదం ఉంది. కార్డు కోసం తిప్పే ప్రతి కుటుంబం, చివరికి అప్పులు చేసి డబ్బులు కట్టే పరిస్థితికి దిగజారుతోంది. ఇది పేదలపై మరింత భారం మోపుతుందని సామాజిక వర్గాలు హెచ్చరిస్తున్నాయి.



FOLLOW: @ANNTELUGU
26-8-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# కూతుళ్ల కబుర్లు... కన్నీటి శవపేటికల్లో

## ప్రతి మరణం వెనక సమాజ నిశ్శబ్దం.. దీన్ని తీసేయండి



> ఇక నాగలక్ష్మి కథ గర్భవతి అయిన భార్యపై భర్త కత్తి పట్టడం, పిల్లల కళ్ల ముందే ఆమెను రక్తపు మడుగులో పడేయడయ ఇది మానవత్వమా? లేక పిశాచత్వమా?

**ఖమ్మం, మహా:** ప్రేమలో మోసం పెళ్లిలో కట్నం కుటుంబాల్లో అవగాహన లోపం ఇవన్నీ కలిసిపోయి ఈ రోజుల్లో అనేక మంది యువతుల ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. ఒక కూతురు కన్నీటిలో మునిగి చనిపోతే, ఒక తండ్రి గుండె చీలిపోతే, ఒక తల్లి చేతుల నుంచి రక్తం జారిపోతే ... అది కేవలం ఒక కుటుంబం విషాదం కాదుబీ అది మొత్తం సమాజానికి గట్టి హెచ్చరిక. అయినా ఈ సంఘటనల నుంచి మనం నేర్చుకోవడంలేదు. ఇదే అత్యంత దురదృష్టం. ఉమ్మడి ఖమ్మం జిల్లా గత కొద్ది రోజులుగా కన్నీటి మడుగైంది. విశాఖ లాడ్జిలో రమ్య ఉరి వేసుకుని చనిపోవడం, అశ్వారావుపేటలో ప్రసన్న కట్నహింసకు బలవడం, మధిరలో నాగలక్ష్మి కత్తి దాడికి గురవడం ౦ ఈ మూడు సంఘటనలు వేర్వేరు ప్రదేశాల్లో జరిగినా, ఒకే సందేశాన్ని మన ముందుంచుతున్నాయి. మన సమాజం బంధాలను రక్షించ లేకపోతోంది ప్రేమను నిలబెట్టలే కపోతోంది ప్రాణాలను కాపాడలేక పోతోంది. రమ్య కథ మనసు ముక్కలయ్యేలా చేస్తుంది. పెళ్లైన నరేష్ మాటలు నమ్మి కలలతో వెళ్లిన ఆమె చివరికి ఒంటరిగా వదిలేయబడి చనిపోయింది. “నా చావుకు అతడే కారణం” అని రాసిన ఆమె సూసైడ్ నోట్ ఒక కూతురు అంతిమ అరుపు. ఆ అరుపు వినిపించిందా ఈ సమాజానికి? వినిపించినా ఎవరు స్పందించారు? ప్రసన్న మరణం ఇంకా భయంకరంగా ఉంది. పదేళ్ల క్రితం బంగారం, డబ్బులు, భూములు కట్నంగా ఇచ్చి పెళ్లి చేశారు. కానీ అక్కడితో ఆగలేదు. కొత్త కట్నం కోసం, కొత్త ఇబ్బందుల కోసం ఆమెను అగ్నిపథం లో నడిపించారు. చివరికి ఎముకల గూడులా మారిన శరీరాన్ని చూసిన తల్లిదండ్రులు “మా కూతురిని ఆహారం పెట్టకుండా చంపేశారు” అని విలపించడం ఏ హృదయాన్నైనా పగల గొడు తుంది. ఈ సంఘటనలన్నీ మనకు చెబుతున్న ఒకే విషయం ఉంది ౦ మన సమాజం భవిష్యత్తు చాలా ప్రమాదంలో ఉంది. ఈ రోజు రమ్యలు, ప్రసన్నలు చస్తుంటే, రేపు మన ఇంటి గుమ్మంలో కూడా ఇలాంటి అరుపులు వినిపించవచ్చు. కూతుళ్లను రక్షించకపోతే, భార్యల ప్రాణాలను విలువ ఇవ్వక పోతే, ప్రేమలో నిజాయితీకి స్థానం ఇవ్వకపోతే ౦ భవిష్యత్తు తరాలు ప్రేమను శత్రువుగా, పెళ్లిని శిక్షగా, కుటుంబాన్ని బంధనంగా భావిస్తాయి. సమాజం మౌనంగా కూర్చుంటే ప్రతి మరణం మన కళ్లపై ముద్ర వేసుకుంటుంది. కట్నం మానాలి. అనుమానం విడవాలి. హింసకు గుడ్‌బై చెప్పాలి. ప్రేమకు నిజాయితీ ఇవ్వాలి. లేనిపక్షంలో నరేష్‌లు ఎప్పటికీ మారరు కానీ చనిపోయే రమ్యలు, ప్రసన్నలు మాత్రం పెరుగుతూనే ఉంటారు.



## స్థానిక సమస్యలను పరిష్కరించాలని
# తహసీల్దార్‌కు బీజేపీ వినతి

**కూసుమంచి, మహా:** కూసుమంచి మండలంలోని స్థానిక సమస్యలను పరిష్కారించాలని కోరుతూ మండల తహసిల్దార్ కి బీజేపీ కూసుమంచి మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. మండలంలో ప్రధానంగా రైతులకు యూరియా కొరత, పంచాయతీ పాలకవర్గం లేక పారిశుద్ధ్య పనులు స్తంభించిపోవడం, సీజనల్ వ్యాధులతో ప్రజలు అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడటం, ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలు నెరవేర్చకపోవడం, ప్రధానంగా రైతు కూలీలకు 2500 అందకపోవడం, వీధి దీపాల సమస్య, మండల కేంద్రంలో బస్టాండు లేకపోవడం వలన ప్రజలు ఇబ్బందులకు గురి కావడం వంటి తదితర అంశాలపై ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విజయ రెడ్డి, మండల స్థానిక సంస్థల ఎన్నికల ఇన్చార్జిగా టేకుమట్ల వీరుగౌడ్, స్టేట్ కౌన్సిల్ నెంబర్ గడ్డం వెంకటేశ్వర్లు గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు రవి రాథోడ్ మండల ప్రధాన కార్యదర్శులు గుగులోత్ మహేందర్ నాయక్, కోరుట్ల వీరన్న జిల్లా నాయకులు బెల్లం మురళి కొత్త శ్రీనివాసరెడ్డి కోడి వెంకన్న గుండ ఉపేందర్ రెడ్డి బద్దం వెంకటరెడ్డి ఆడపు మధు మోతిలాల్ పిట్టల వేణు తదితరులు పాల్గొన్నారు



# గ్రామీణ వైద్యశాలలు తనిఖీ

**జూలూరుపాడు, ఆగస్టు 25, (మహా):** పై అధికారుల ఆదేశాల మేరకు జూలూరుపాడు మండల కేంద్రంలోని గ్రామీణ వైద్యశాలలను జూలూరుపాడు మండల వైద్యాధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో నిబంధనలకు విరుద్ధంగా గ్రామీణ వైద్యులు అర్హతకు మించి అధిక డోసులు ఇస్తున్నట్లు గుర్తించారు. అదే విధంగా విచ్చలవిడిగా స్టెరాయిడ్స్, బ్రాడ్ స్పెక్ట్రమ్, యాంటీ బయాటిక్స్, ఓరల్ హార్మోనల్ పిల్స్ వంటి మందులు అమాయక ప్రజలకు ఇస్తూ, వారి ఆరోగ్యాలతో పాటు, ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నట్లు నిర్ధారించారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. తదుపరి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.



## రైతులకు యూరియా అందించాలి



**టేకులపల్లి - మహా :** టేకులపల్లి మండల వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట రైతుల యూరియా కొరత నేపథ్యంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మాట్లాడుతూ 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో రైతులకు యూరియా కొరత రాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి యూరియా కొరత సృష్టించి రైతులను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తుందని ప్రస్తుత పంటల ఎదుగుదల సీజన్ కావడంతో రైతులు యూరియా లేక లైన్లో నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నిల్చున్న దొరికే పరిస్థితి లేదని కొంతమంది దళారులు యూరియాను బ్లాక్ చేసి అధిక ధరలో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న చూసి చూడనట్లుగా వదిలేస్తున్నారని మోసపూరిత హామీలు ఇచ్చి అధికారులు వచ్చిన కాంగ్రెస్ పాలనను గాలికి వదిలేసి అడ్డగలుగు హామీలు ఇచ్చి నెరవేర్చే పరిస్థితి లేక చేతులెత్తేసిందని తెలిపారు ఈ కార్యక్రమంలో చీమల సత్యనారాయణ తేజావత్ రవి నాయక్ బోడ బాలు నాయక్ జరుకులా లచ్చు నాయక్ బాలకృష్ణ బాలాజీ కిషన్ బొమ్మెర్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



**ముదిగొండ ఆగస్టు 25 మహా:** శాసన సభ ఎన్నికల సందర్భంగా అధికారమే లక్ష్యంగా అ నాడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను, అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కిన హామీలు అమలు చేయాలని మండల సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం కోరారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన ముదిగొండలోని మచ్చ వీరయ్య భవనం నుండి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం బట్టు పురుషోత్తం మాట్లాడుతూ రెండు లక్షల రైతు రుణ మాఫీ మోసపూరితంగా చేశారని, ఇందిరమ్మ ఇళ్ళ అధికార పార్టీ నాయకులకు, అనర్హులకు, బంధువులకు మాత్రమే ఇస్తు అధికార దుర్వినియోగం చేస్తున్న ఇందిరమ్మ కమిటీలను సైతం రద్దు చేయాలని ఆయన కోరారు. మహిళలకు ఇస్తామన్న నెలకు 2500/- రూపాయలు ఉపాధి హామీ పథకంతో సంబంధం లేకుండా అర్హత కలిగిన ప్రతి మహిళకు ఇవ్వాలని, అలాగే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కూడా అమలు చేయాలని కోరారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్లకు అర్హత కలిగిన లబ్దిదారులు తహస్దిలార్ సునీత ఎలిజబెత్ కు వినతి పత్రం అందజేశారు.

### కౌజు పిట్టల పెంపకం యూనిట్ చేపల పెంపకం యూనిట్

## కూరగాయల తోటను సందర్శించిన కలెక్టర్



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 25 (మహా):** లక్ష్మీదేవిపల్లి మండలంలోని శేశాగిరినగర్ గ్రామ పంచాయతీలో పైలెట్ ప్రాజెక్ట్గా ఎంపికైన దుర్గాంబిక గ్రామ సంఘంలోని అరుణోదయ గ్రామ సమాఖ్యలోని ప్రజ్ఞ కౌజు పిట్టల పెంపకం యూనిట్ను జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జితేష్ వి. పాటిల్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో తొలిసారిగా కౌజు పిట్టల పెంపకం యూనిట్ను ప్రారంభించినందుకు మహిళా సంఘాలను అభినందించారు. ప్రతి మండలంలోని మహిళా సంఘాల సభ్యులు కూడా కౌజు పిట్టలను పెంచుకోవాలని, దాని ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. ప్రతి 40 రోజులకు ఒక్కసారి వీటిని అమ్ముకోవచ్చని, మార్కెట్లో వీటికి మంచి డిమాండ్ ఉందని తెలిపారు. తదనంతరం చేపల పెంపక యూనిట్ను పరిశీలించి వారికి అనేక సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం సుజాతనగర్ మండలంలోని రవి హైబ్రిడ్ సీడ్స్ వారి క్షేత్రాన్ని సందర్శించి, వారు పండిస్తున్న అన్ని రకాల కూరగాయల తోటలను పరిశీలించారు. జిల్లాలో కనీసం 10 గుంటల స్థలం కలిగిన ప్రతి మహిళా రైతు కూరగాయల సాగు ప్రారంభించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# సైబర్ నేరాలకు పాల్పడుతున్న 13 మంది అరెస్ట్

## జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

## ఆరు నెలలుగా మొత్తం 8.5 కోట్ల రూపాయల లావాదేవీలు




**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 25 (మహా):** గత రెండు రోజుల క్రితం ఎన్ సి ఆర్ పి (నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్) ద్వారా జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అందిన ఫిర్యాదుల మేరకు టేకులపల్లి పోలీసులు మరియు జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులు సంయుక్తంగా ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.సోమవారం ఎస్పీ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం, టేకులపల్లిలో మీ-సేవ కేంద్రాన్ని నడుపుతున్న బోడ శ్రీధర్ అనే వ్యక్తికి టెలిగ్రామ్ యాప్ ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్ళు ఇతరులకు నగదును బదిలీ చేస్తే కమీషన్ ఇస్తామని చెప్పడంతో ఇతనితో పాటు టేకులపల్లి మండలానికి చెందిన మరో 12 మంది చదువుకున్న యువకులు నకిలీ పత్రాలతో 60 కరెంట్ అకౌంట్లను తెరిచి ఇతరుల బ్యాంకు ఖాతాలలోకి నగదును పంపిస్తూ కమీషన్లు పొందుతూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. గత ఆరు నెలలుగా మొత్తం 8.5 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లుగా గుర్తించడం జరిగిందని, వీరి వద్ద నుండి 12 సెల్ఫోన్లు మరియు ఒక బ్యాంకు పాస్ బుక్ ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామని, దేశవ్యాప్తంగా వీరి బ్యాంక్ ఖాతాలపై 108 ఫిర్యాదులు అందాయని ఎస్పీ తెలిపారు. పట్టుబడిన వ్యక్తుల వివరాలు : టేకులపల్లికి చెందిన, బోడ శ్రీధర్ (27), బోడ రాజేష్ (25), బోడ రాజన్న(22), బానోత్ జగదీష్ (27), తేజవత్ నరేష్ (25), పాలె పొంగు పవన్ కళ్యాణ్ (27), భూక్య వీరన్న ( 26), జాటోత్ నరేష్ (24), బోడ జంపన్న (25), బోడ రాజారాం (27), భూక్య ప్రవీణ్ (24), మాలోత్ ప్రవీణ్ ( 24), ఉరిమెళ్ళ భరత కృష్ణ (25), పట్టుబడిన ఈ (13) మంది వ్యక్తులను జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం ఇల్లందు కోర్టునకు తరలించడం జరిగినది. సైబర్ నేరగాళ్లను టేకులపల్లి పోలీసు అధికారులు టేకులపల్లి సి ఐ బి సత్యనారాయణ, టేకులపల్లి ఎస్ ఐ ఎ రాజేందర్ మరియు సైబర్ క్రైమ్ సి ఐ ఎస్ జితేందర్ మరియు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్ళు వివిధ రకాలుగా అమాయకుల ఖాతాల నుండి డబ్బులను కాజేయాలని చూస్తున్నారని, సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా ఇలాంటి నేరాలకు ఎవరైనా పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎవరైనా సైబర్ నేరానికి గురై నగదును కోల్పోతే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే కోల్పోయిన నగదును తిరిగి పొందే అవకాశం ఉంటుందని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**ఖమ్మం, ఆగస్టు -25, మహా:** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా సమాధానం అందించాలని, మన పరిధిలో చేయగలిగిన పనిని వెంటనే పూర్తి చేయాలని, మనం చేయలేని పక్షంలో దానికి గల కారణాలను, నిబంధనలను వివరిస్తూ సమాధానం ఇవ్వాలని సూచించారు. బోనకల్ మండలం చిరునోముల గ్రామానికి చెందిన నిమ్మతోట నాగయ్య తనకు నాగార్జునసాగర్ కాలువ బోనకల్ బ్రాంచ్ పరిధిలో 5 సంవత్సరాలు పనిచేసిన అనుభవం ఉందని, ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా లష్కర్ గా నియామకం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఇరిగేషన్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు కమీషన్ రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, డీలర్లకు కమీషన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కు రాస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఖమ్మం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు దొండపాటి రమేష్ మార్క్ ఫెడ్ ద్వారా ఖరీఫ్ పెసర పంటను కొనుగోలు చేయుటకు ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎం మార్క్ ఫెడ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొణిజెర్ల మండలం తనికెళ్ళ గ్రామానికి చెందిన ప్రజలు తనికెళ్ళ గ్రామం నుంచి బోడ్యా తండా గ్రామానికి వెళ్లే డొంక రహదారి ఆక్రమణకు గురవుతుందని, డొంక రహదారికి ప్రభుత్వం సర్వే చేసి అభివృద్ధి చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు రాస్తూ చర్యలు చేపట్టాలని అన్నారు.

# మట్టి మాఫియా

- అడ్డు అదుపు లేకుండా అడ్డగోలు తవ్వకాలు
- ఆ అక్రమార్కుడు కన్నుపడితే అంతే
- ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ తోలకాలు
- పట్టా భూముల్లో అక్రమంగా తవ్వుతున్న వైనం
- అనుమతులు ఉన్నాయంటూ బెదిరింపులు
- ఇది మీ భూమి అని గ్యారెంటీ ఏంటి అని బకాయింపులు




**ముదిగొండ ఆగస్టు 25 మహా:** ప్రస్తుతం మార్కెట్లో మట్టి, గ్రావెల్ కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో అక్రమార్కులు అడ్డు అదుపు లేకుండా ఎక్కడ మట్టి కనిపిస్తే అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా తవ్వి మట్టిని తరలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే రిటైర్డ్ ఉపాధ్యాయుడైన గోగినేని ఉపేందర్ రావుకు నేలకొండపల్లి మండలం గువ్వల గూడెం లో, ముదిగొండ మండలం చిరుమర్రి రెవెన్యూ సరిహద్దుల్లో వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమి ఉన్నది. ఈ భూమిని గ్రామంలోని ఓ వ్యక్తికి కౌలుకి ఇచ్చాడు. గత యాసంగిలో సాగు పూర్తయిన తర్వాత పొలం వద్దకు వెళ్లలేదు. వీరి భూమికి అనుకొని ఉన్న చిరుమర్రి రెవెన్యూ పరిధిలోని వారి భూమిలో మట్టిని తవ్వి తరలించటం మొదలుపెట్టారు. జిల్లాలోనే ఓ బడా కాంట్రాక్టర్ కాంట్రాక్టు తీసుకొని మండలంలోని తన మనుషులకు మట్టిని తరలించే పని అప్పచెప్పాడు. ఇంకేముంది రాత్రి, పగలు అనే తేడా లేకుండా వేల కొద్ది ట్రిప్పులు మట్టిని తరలించారు. ఇలా తవ్వుతూ పక్కనే ఉన్న ఉపేందర్ రావు పొలంలో సైతం మట్టిని తవ్వి తరలించారు. యాసంగి సాగు పూర్తయ్యాక కౌలు రైతు పొలం వైపు రాకపోవటంతో అదే అదునుగా భావించి మట్టిని దర్జాగా తవ్వి తరలించారు. వర్షాలు పడి సాగు పనుల పెట్టడం కోసం పొలానికి వెళ్ళినప్పుడు పొలంలో పెద్ద పెద్ద గోతులు తవ్వి ఉండటం గమనించాడు. సుమారు పది గజాలు ఉపేందర్ రావు పొలం లోపలికి వచ్చి 10 నుంచి 15 అడుగుల లోతులో మట్టిని తవ్వారు. కౌలు రైతు ఉపేందర్ రావుకు విషయం తెలపగా సదరు వ్యక్తులను అడగ్గా పొరపాటున తవ్వాము మరలా పొలం బాగు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్ని రోజులైనా పొలం బాగు చేయకపోగా మరో 10 అడుగులు ముందుకు వచ్చి మట్టిని తవ్వారు. ఈ విషయం గురించి నిలదీయగా అది మీ పొలం కాదు మీ పొలం అని గ్యారెంటీ ఏంటి మా పొలంలోనే తవ్వుతున్నాము మాకు అన్ని అనుమతులు ఉన్నాయని బుకాయించారు. దీంతో ఉపేందర్ రావ్ నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. సదరు వ్యక్తుల్ని పిలిపించగా అదే సమాధానం చెప్పడంతో మీకు ఏ అనుమతులు ఉన్నాయి వాళ్ళ పొలంలో పోవడానికి నువ్వు ఎవరు అని గట్టిగా మందలించడంతో మరలా పొలం బాగు చేస్తానని హామీ ఇవ్వడంతో పాటు, కాగితం కూడా రాసిస్తానని చెప్పాడు. ఆ తర్వాత వారం రోజులు అయినా ఆ ఊసే ఎత్తలేదు. మరలా ఉపేందర్ రావ్ పోలీస్ స్టేషన్కు వెళ్ళగా పోలీసులు ఇది సివిల్ మ్యాటర్ దీంట్లో మేము ఏమి చేయలేమని వారు చేతులెత్తేశారు. పట్టాదారు ఉపేందర్ ముదిగొండ తాసిల్దారు కూడా ఫిర్యాదు చేశాడు. అడ్డగోలుగా తవ్వి వదిలేయడంతో పక్కనే ఉన్న భూమి కొంచెం కొంచెం గా ఊర్లుతూ వస్తున్నది మరిన్ని రోజులు ఇలానే ఉంటే మంచిగా ఉన్న భూమి కూడా పాడయ్యే అవకాశం ఉన్నది. వర్షాలు పడటంతో ప్రస్తుతం మట్టి తోవట్లేదని మరల కొద్ది రోజుల్లోనే మట్టి తరలించవచ్చు అని ఉపేందర్ రావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి తనకు న్యాయం చేయాలని ఉపేంద్రరావు కోరుతున్నాడు.

## ప్రీ ప్రైమరీ పాఠశాలలో పిల్లలను చేర్పించండి

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 25 (మహా):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రీ ప్రైమరీ పాఠశాలలలో పిల్లలను చేర్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. జిల్లాలోని 21 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీకి తరగతుల ప్రారంభించడానికి ప్రభుత్వము నుండి అనుమతి వచ్చిన సందర్భంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశంలో మాట్లాడుతూ ఈ 21 పాఠశాలల పరిధిలోని నాలుగు సంవత్సరాలు నిండిన బాల బాలికలను ప్రీ ప్రైమరీ తరగతులలో జరిపించడానికి మండల విద్యాశాఖ అధికారులు, ఐసిడిఎస్ అధికారులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ఈ పిల్లలకు కావలసిన యూనిఫామ్, పుస్తకాలు, క్రీడా పరికరాలు, అందించనున్నామని, పాఠశాలను రంగులతో ఆకర్షణీయంగా తయారు చేసి పిల్లలను ఆకర్షించాలని అన్నారు. ఈ పిల్లలకు మధ్యాహ్న భోజనం అదేవిధంగా అల్పాహారం కూడా అందించనున్నామని కలెక్టర్ తెలిపారు.



## రాజీవ్ స్వగృహ ఫ్లాట్ కొరకు 2 లక్షలు చెల్లించి పేరు రిజిస్టర్ చేసుకోవాలి



**ఖమ్మం, ఆగస్టు -25, మహా:** రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ లో ఫ్లాట్ కొరకు ఆసక్తి గల ఉద్యోగులు ఆగస్టు 30 లోపు 2 లక్షల రూపాయలు చెల్లించి పేరు రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, రాజీవ్ స్వగృహ సీఈ భాస్కర్ రెడ్డి లతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ పై సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో రాజీవ్ స్వగృహ జలజ టౌన్ షిప్ ప్రాజెక్టు 9 ఎకరాల 22 గుంటలలో నిర్మించిన 8 టవర్లలో అసంపూర్తిగా ఉన్న 576 ఫ్లాట్ లను ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో నోటిఫికేషన్ జారీ చేసి సమావేశం నిర్వహించామని, గజం భూమి 1150 రూపాయల ధర నిర్ణయించామని అన్నారు. జలజ టౌన్ షిప్ లో ఉన్న 8 టవర్లు ఉద్యోగులకు లాటరీ పద్ధతిన అందించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. సొంత ఇళ్ళు కావాలని ఆసక్తి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఈ లాటరీలో పాల్గొని తమ కలను నెరవేర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. రివర్ వ్యూ తో టవర్స్ బాగా ఉన్నాయని, ఖమ్మం నగరంలో అభివృద్ధి త్వరగా జరిగే ప్రాంతంలో ఈ టవర్లు ఉన్నాయని తెలిపారు.

## ప్రశాంతంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ

**ఖమ్మం, ఆగస్టు-25, మహా:** వైభవోపేతంగా, ప్రశాంతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వినాయక చవితి సందర్భంగా గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, వైభవోపేతంగా జరగాలని అన్నారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు ఉత్సవాలు ఘనంగా జరిగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా, నిమజ్జనం పాయింట్ల వద్ద ఏర్పాట్లు తదితర అంశాల్లో మంచి ఏర్పాట్లు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. నవరాత్రి వేడుకల సందర్భంగా ఖమ్మం జిల్లాలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అసిస్టెంట్ డైరెక్టర్



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 25 (మహా):** లంచం తీసుకుంటూ ఉన్నతాధికారి పట్టుబడ్డ ఘటన కొత్తగూడెంలో చోటు చేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావును లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ అధికారి, ఎరువుల దుకాణం యజమాని నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ సిబ్బంది పకడ్బందీగా నిర్వహించిన ఆపరేషన్లో పట్టుబడ్డాడు. ఎరువుల దుకాణం నిర్వహణకు సంబంధించిన అనుమతుల విషయంలో సాయం చేస్తానని హామీ ఇచ్చిన నరసింహారావు, వ్యాపారవేత్త నుంచి రూ.25 వేల లంచం కోరాడు. దీనిపై విసిగిపోయిన వ్యాపారవేత్త ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

## సొసైటీ ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేసిన డీఏవో

**కారేపల్లి, మహా :** కారేపల్లి సొసైటీ ఎరువుల గోడౌన్ ను జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య సోమవారం తనిఖీ చేశారు. స్టాక్, సేల్ రిజిష్టర్స్ ను పరిశీలించారు. గోడౌన్‌లో యూరియా, ఇతర ఎరువులను పరిశీలించారు. రైతులకు యూరియా ను ఏ విధంగా సరఫరా చేస్తున్నారో పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో డీఏవో మాట్లాడారు. నానో యూరియా పై అవగాహన కల్పించారు. నానో యూరియా తక్కువ ఖర్చు అధిక ప్రతిఫలం లభిస్తుందన్నారు. యూరియా బదులు నానో యూరియా వాడకం చేయాలని సూచించారు. నానో టెక్నాలజీ తో నత్రజని వృద్ధాకాకుండా ఆకు ద్వారా మొక్కకాండం వరకు చేరుతుందన్నారు. యూరియా కు ఎక్కడ కొరతలేదని రైతులు అపోహకు గురికావద్దన్నారు.

06

FOLLOW: @ANNTELUGU

26-8-2025

WWW. EPAPER.MAHAADAILY.COM

భద్రాద్రి కొత్తగూడెం

మహా పత్రిక

ANN తెలుగు

## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 25 (మహా):** ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. అశ్వాపురం మండలం కళ్యాణపురం గ్రామానికి చెందిన గుమ్మడి సాగర్ ఇంటర్ వరకు చదివి నిరుద్యోగిగా ఉన్నానని కుటుంబ పోషణ భారంగా ఉన్నదని తనకు ఏదైనా ఒక కార్యాలయంలో అటెండర్ జాబు గాని వాచ్ మెన్ జాబు గాని ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. చంద్రుగొండ మండలం రావికంపాడు గ్రామానికి చెందిన తలారి ముత్తయ్య ప్రజాపాలన కార్యక్రమంలో ఉచిత కరెంటు కొరకు గృహ జ్యోతి పథకంకి దరఖాస్తు చేసుకోని ఉన్నానని కానీ తన ఇంటికి కరెంట్ బిల్లు వస్తుందని తనకు గృహ జ్యోతి పథకం కింద ఉచిత కరెంటు మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి చంద్రుగొండ ఎంపీడీవో కి ఎండార్స్ చేశారు.

## దోమల మందు పిచికారి చేయాలని వినతి



**ముదిగొండ ఆగస్టు 25 మహా:** మండలపరిధిలో కమలాపురం పంచాయతీ శివారి అయ్యగారిపల్లిలో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి బి లక్ష్మికు పంచాయతీ కార్యాలయంలో సోమవారం వినతపత్రం అందజేశారు. ఈసందర్భంగా సిపిఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి కె కుటుంబరావు మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధం పేరకపోయి సైడ్ కాలువల్లో పూడుకతీత తీయక దోమలు స్వేరవిహారం చేస్తున్నాయన్నారు. దోమల బెడదతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, ఫాగింగ్ చేయాలని అయన సెక్రెటరీ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం పెరిగి బ్యాక్టీరియాతో గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతున్నారని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, వృద్ధులు, వితంతువులు, వికలాంగుల పెన్షన్లు పెంచాలని కె కుటుంబరావు చెప్పారు. గ్రామ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ నాయకులు బొజ్జ అశోక్, సిపిఐ(ఎం) నాయకులు బొజ్జ వెంకట్, షేక్ మదర్ సాహెబ్, బొజ్జ పెద్దబాబు, బొజ్జ జీవన్రాజు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి గౌసుద్దీన్ వితరణ



**కారేపల్లి, మహా :** కారేపల్లి గ్రామపంచాయతీ మాజీ కార్మికుడు ఆదెర్ల వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు ఎస్కె.గౌసుద్దీన్ సోమవారం రూ.5వేలు, 50 కేజీల బియ్యంను వితరణ చేశారు. వీటిని మాజీ జడ్పీటీసీ వాంకుడోత్ జగన్ చేతుల మీదిగా అందజేశారు. మృతునికి కుటుంబాన్ని పరామర్శించిన గౌసుద్దీన్ జీప కార్మికుడిగా ఆదెర్ల వెంకటయ్య చేసిన సేవలను కొనియాడారు. గ్రామపంచాయతీలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తానున్నానంటూ గౌసుద్దీన్ ముందుకి వచ్చి ఆర్థిక సాయం చేసి భరోసాకల్పిస్తున్నారు. గౌసుద్దీన్ సేవలను పలువురు కొనియాడారు. ఈకార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మనిగొండ నాగేశ్వరావు, పెద్దలు ఖలీలుల్లాఖాన్, బిక్షపతి, ఫిరోజ్, అబ్దుల్ వాహిద్, ముస్తాక్, దిండి లచ్చయ్య తదితరులు పాల్గన్నారు ను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

# మున్సిపల్ క్వార్టర్స్ నోటీస్‌లు వెనక్కి తీసుకోవాలి

## నివాసం వున్న వారికే మార్కెట్ రేట్ ప్రకారం ఇవ్వాలి: విక్రమ్

### సానుకూలంగా స్పందించిన కమిషనర్...



**ఖమ్మం, మహా:** నగరం నడిబొడ్డున 43 వ డివిజన్ పరిధిలోని రేవతి సెంటర్ మున్సిపల్ క్వార్టర్స్ కు ఇచ్చిన నోటీసులు వెంటనే వెనక్కి తీసుకోవాలి అని , గత 40 సంవత్సరాలుగా వాటిని నమ్ముకుని అక్కడే నివాసం వున్న వారికి మార్కెట్ రేట్ ప్రకారం స్థానికులకే ఇవ్వాలని కోరుతూ సీపీఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ముందు నిరసన తెలిపి మేయర్, కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ మాట్లాడుతూ గతంలో సీపీఎం పార్టీ నేత చిర్రవూరి లక్ష్మినర్సయ్య పరిపాలన పాలనా కాలంలో ఆనాడు ఖమ్మం టౌన్ లో మామిళ్ళగూడెం, బోనకల్లు రోడ్, త్రీ టౌన్ డాక్టర్ యలమంచిలి రాధాకృష్ణమూర్తి నివాసం వద్ద ఇలా పలు చోట్ల మున్సిపల్ అధికారులు, ఉద్యోగస్తులు, పారుశుద్ధం పని చేసే వారికి క్వార్టర్ లు కట్టించారు అని తెలిపారు. అందులో భాగంగా రేవతి సెంటర్ లో 140 క్వార్టర్స్ పారుశుద్ధం కార్మికుల కోసం కట్టించారు అని తెలిపారు. కాలక్రమంలో చాలా చోట్ల అక్కడే నివాసం వున్న ఉద్యోగస్తులకు స్థలం మార్కెట్ రేట్ ప్రకారం ఇచ్చారు అని తెలిపారు. ఇప్పుడు అకస్మాత్తుగా రేవతి సెంటర్ మున్సిపల్ క్వార్టర్స్ కు నోటీసు లు ఇవ్వడంతో రిటైర్మెంట్ ఉద్యోగస్తులు, ప్రస్తుత ఉద్యోగులు ఆందోళన కు గురయ్యారు అని పేర్కొన్నారు. 40 సంవత్సరాలుగా అక్కడే నివాసం వుండి క్వార్టర్స్ మరమత్తులు కోసం ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వకపోతే వాటినే రిపేర్ చేసుకుని జీవనం సాగిస్తున్నారు అని తెలిపారు. స్థానికులకే క్వార్టర్స్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 2007 వ సంవత్సరంలో ఆనాడు పార్టీ పరిపాలనా కాలంలో కూడా మాజీ మున్సిపల్ చైర్మన్ సమీనా అఫ్రోజ్ చోరవతో పాలకవర్గంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు అని గుర్తు చేశారు కార్పొరేషన్ అధికారులు, మేయర్, పాలక పార్టీ నేతలు ఈ సమస్య పట్ల సానుకూలంగా స్పందించాలి అని కోరారు. ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. మార్కెట్ రేట్ ప్రకారం వాటిని నమ్ముకుని నివాసం వున్న వారికి ప్రభుత్వం ఇవ్వాలి అని డిమాండ్ చేశారు . ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి క్వార్టర్స్ బాధితులకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బుర్రి శోభారాణి, నాయకులు భద్రం, ఉపేంద్ర, రెడపంగి శ్రీను, నరసింహారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు



## జూలూరుపాడు రేంజ్ అటవీ ప్రాంతాన్ని సందర్శించిన డివిజనల్ ఫారెస్ట్ అధికారి

**జూలూరుపాడు, ఆగస్టు 25, (మహా):** సాధారణ తనిఖీలు భాగంగా జూలూరుపాడు రేంజ్ అటవీ ప్రాంతాన్ని కొత్తగూడెం డివిజినల్ ఫారెస్ట్ అధికారి యు కోటేశ్వరరావు సోమవారం సందర్శించారు. గుండెపుడి బీట్ నందు పోడు భూములను, ఊట కుంటలను, ప్లాంటేషన్ ను నర్సరీని సందర్శించి, అటవీ రక్షణ, నర్సరీలలో మొక్కల పెంపకం సంరక్షణపై అటవీ శాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ప్రసాదరావు, ఎస్.కె నాసూర్ బి, కిషన్, శరన్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా పంపిణిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి వైఫల్యం



**నేలకొండపల్లి, ఆగస్టు 25 మహా :** యూరియా సరఫరా పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి వైఫల్యం అయ్యాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి బానుప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యూరియా తక్షణమే ప్రభుత్వాలు రైతులకు అందించాలని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వినపత్రం ద్వారా తాసిల్దార్ కు అందించారు... ఈ సందర్భంగా అయన మాట్లాడారు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లు రైతుల పట్లా నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులకు కష్టాలు వచ్చి పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తిండి తిప్పలు లేకుండా తమ భార్య పిల్లలతో వచ్చే క్యూ లైన్ లో నిలబడి తే ఆధార్ కార్డుకు ఓ బస్తా యూరియా అందించడమేంటని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు గ్రామ గ్రామాన యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల కార్యదర్శి పాల్తియా శ్రీనివాసరావు, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరావు, సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, రైతు సంఘం మండల సభ్యులు బాగం నరసింహారావు, రాయల మాదవరావు, బాలిన కృష్ణంరాజు, వల్లాల కృష్ణ, చిర్ర ప్రసాద్ సిపిఐ మండల సభ్యులు కాశబోయిన పాల్గొన్నారు.

# డెలివరీ దందాకు చెక్

**ఖమ్మం, మహా:** ఎల్‌పీజీ ధరలు పెరగడంతో వినియోగదారుల జేబులు చించుకుపోతున్న తరుణంలో, డెలివరీ సిబ్బంది వసూలు చేసే అదనపు డబ్బులు మరింత భారమయ్యాయి. చిన్న కుటుంబాలకు ఒక్కోసారి అదనపు రూ.50 కూడా పెద్ద బరువుగా మారింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవడంతో వినియోగదారుల హృదయాల్లో ఊరట పుట్టింది. ఇకపై ఇంటికి సిలిండర్ డెలివరీ చేసే సందర్భంలో బిల్లులో ఉన్న మొత్తం తప్పించి ఒక్క పైసా కూడా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ నిర్ణయం వల్ల ఖమ్మం జిల్లాలోనే కోట్ల రూపాయల మేర వినియోగదారులు లాభపడనున్నారు.



## డెలివరీ దందాకు చెక్

ఇంటి వద్దకే సిలిండర్ డెలివరీ చేసే సిబ్బంది వినియోగదారుల నుండి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని ఎన్నో ఆరోపణలు వచ్చాయి. డబ్బులు ఇవ్వకపోతే సిలిండర్ ఆలస్యంగా సరఫరా చేయడం, ఇబ్బందులు పెట్టడం వంటి ఘటనలు తరచుగా వినిపించేవి. ఇప్పుడు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. వినియోగదారులు చెల్లించాల్సింది బిల్లులో ఉన్న మొత్తం మాత్రమేనని అధికారులు ప్రకటించారు.

## 5 కి.మీ.లోపు డెలివరీ ఉచితం

పౌర సరఫరాలు విభాగం ప్రకారం, 5 కి.మీ. పరిధిలో ఎటువంటి డెలివరీ ఛార్జీలు వసూలు చేయరాదు. 5 కి.మీ. దాటితేనే ఒక్కో సిలిండర్‌కి రూ.1.60 పైసలు వసూలు చేయవచ్చు. అందువల్ల, నగరాలు, మండల కేంద్రాల్లో ఉన్న వినియోగదారులు ఇకపై ఎటువంటి అదనపు భారాన్ని మోసే అవసరం ఉండదు.

## ఫిర్యాదు సదుపాయాలు

ఒకవేళ డెలివరీ సిబ్బంది బిల్లుకు మించి డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేయవచ్చు. తాలూకా తహసీల్దార్ కార్యాలయంలోని ఆహార విభాగం, పౌర సరఫరాలు శాఖలో వినియోగదారులు ఫిర్యాదు నమోదు చేసుకునే అవకాశం ఉంది. దీనివల్ల అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట పడనుంది.

## ఖమ్మం జిల్లాలో గణాంకాలు

జిల్లాలో మొత్తం 33 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 4,20,713 కనెక్షన్లు కొనసాగుతున్నాయి. అందులో 2,14,988 సింగిల్ సిలిండర్ కనెక్షన్లు, 1,03,876 డబుల్ సిలిండర్ కనెక్షన్లు, దీపం పథకం ద్వారా 78,456 కనెక్షన్లు, సీఎస్ఆర్ పథకం కింద 23,393 కనెక్షన్లు ఉన్నాయి. అదేవిధంగా భద్రాది కొత్తగూడెం జిల్లాలో మరో నాలుగు లక్షల కలెక్షన్లు ఉన్నాయి.

## కోట్ల రూపాయల ఆదా

ప్రతి సిలిండర్ డెలివరీపై రూ.50 వసూలు చేస్తే 8.20 లక్షల కనెక్షన్లకు ఒక్కసారిగా రూ.4.10 కోట్లు ఆదా అవుతుంది. ప్రతి కుటుంబం నెలకు ఒక సిలిండర్ వాడుతుందనుకుంటే సంవత్సరానికి ఈ మొత్తం రూ.50.20 కోట్లు వరకు పెరుగుతుంది. ఇది నేరుగా వినియోగదారుల జేబుకే మేలు చేయనుంది.

# మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

**జూలూరుపాడు, ఆగస్టు 25, (మహా):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను స్థానిక సీఐ శ్రీలక్ష్మి, ఎస్సై రవి సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు స్నేహ సంబంధాలు పెంపొందడానికి, మానసిక ఉల్లాసం పొందడానికి, శరీర దృఢత్వాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి, ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలలో నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగాలు సాధించడానికి కూడా ఉపయోగపడతాయని తెలిపారు. ఈ ఆటల పోటీలలో మండలానికి చెందిన 8 పాఠశాలల నుండి సుమారు 400 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ బి జుంకీలాల్, పాపకొల్లు పాఠశాల హెచ్ఎం ఎస్ కే మీరా సాహెబ్, జూలూరుపాడు హెచ్ఎం పి లక్ష్మీనరసయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పిడీలు తదితరులు పాల్గొన్నారు.



# కారేపల్లిలో రేషన్ డీలర్ల నిరసన

కారేపల్లి, మహా : రేషన్ డీలర్ల సమస్యలపై కారేపల్లి రేషన్ డీలర్లు సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఐదు నెలలుగా రేషన్ డీలర్లకు కమీషన్ రాక పోవటంతో ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్ల సమస్యలపై తహసీల్ధార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు దారావత్ భద్రునాయక్, కార్యదర్శి షేక్ మతీన్ లు మాట్లాడుతూ రేషన్ డీలర్లకు నెల వారి కమీషన్ ప్రతి నెల విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం మండల ఉపాధ్యక్షులు ఈసం మంగతాయి, డీలర్లు సూర్యకుమార్, వీరభద్రం, నాగేశ్వరరావు, భూక్య భీముడు, గుగులోత్ మంగ్య, మంగీలాల్, బాసు, దళ్‌సింగ్, ఎల్లబోయిన వెంకన్న, ఒదల జానయ్య, గోపమ్మ, వీరభద్రమ్మ, కుర్సం నాగేశ్వరరావు, ఎట్టి నాగేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# పోలీసు సూచనలు పాటిస్తూ పండుగ జరపండి

**కారేపల్లి, మహా:** గణేష్ మండపాలతో ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రజలకు ఇబ్బందులు కల్గించవద్దని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి సూచించారు. సోమవారం కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో సీఐ మాట్లాడుతూ మండపాలలో, ఊరేగింపులలో అశ్లీల నఅత్యాలు నిషేధమన్నారు. రాత్రి 10.30 గంటల వరకు మాత్రమే సౌండ్ సిస్టమ్ వినియోగించుకోవాలన్నారు. మండపంలో లైటింగ్ కోసం సరైన విద్యుత్ అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. రాత్రిపూట మండపం వద్ద తప్పని సరిగా పహారాకు ఉండాలన్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్ లేదా నోడల్ ఆఫీసర్ సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సమావేశం కారేపల్లి ఎస్సై బైరు గోపి, కోడేత్రాచు, నవజ తదితరులు ఉన్నారు.



# అధికారుల పాలనలో సమస్యల తిష్ట

**కారేపల్లి, మహా :** స్థానిక సంస్థలకు ఎన్నికలు లేక గ్రామాల సమస్యలను పట్టించుకునే వారు కరువైనారని కారేపల్లి మండల ఐద్వా కార్యదర్శి కొండబోయిన కొండబోయిన ఉమావతి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కారేపల్లిలో ఐద్వా మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షురాలు సూరబాక ధనమ్మ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో కొండబోయిన ఉమావతి మాట్లాడుతూ ప్రభుత్వం స్థానిక ఎన్నికలు వాయిదా మీద వాయిదా వేస్తూ ప్రత్యేక అధికారులతో పాలన సాగిస్తుందన్నారు. గ్రామాలలో సమస్యల పరిష్కారంకు నిధులు లేవంటూ అధికారులు చేతులు ఎత్తివేశారన్నారు. వర్షాకాలం కావటంతో రహదారులు బురదమయం అవుతున్నాయని, మంచినీరు కలుషితం, వీధిలైట్లు లేక అవస్థలు పడుతున్నారన్నారు.

# పట్టిపీడిస్తున్న వైరల్ ఫీవర్స్ ఒక్క రోజే 360 ఓపీ తో కిటకిట

**నేలకొండపల్లి, ఆగస్టు 25 మహా:** పట్టిపీడిస్తున్న వైరల్ ఫీవర్స్ తో మండలం వణికుతుంది. వివిధ గ్రామాల నుంచి వైరల్ ఫీవర్స్ తో స్థానిక ప్రభుత్వ హస్పిటల్ కు రోగుల సంఖ్య తీవ్రంగా పెరిగింది. సోమవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు వివిధ రోగాలతో 360 మంది ఓపీ నమోదైంది. అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వీటిలో అధికంగా వైరల్ ఫీవర్స్ తో బాధపడుతున్న పేషెంట్ల సంఖ్య ఉంది. వీరిలో 60 మంది ఇన్పేషెంట్స్ గా చేరగా.. వైరల్ ఫీవర్స్ తీవ్రంగా ఉండటంతో 23 మంది హస్పిటల్ లో అడ్మిట్ అయ్యారు. గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించటం వలన ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. వసతి గృహాలకు చెందిన విద్యార్థులు జ్వరాలతో –హస్పిటల్ లో చేరారు. జిల్లా లోనే అత్యధికంగా 360 మంది ఓపీ నమోదెన్నటు తెలుస్తుంది. ఇది ఇలా ఉండగా.. హస్పిటల్ కు వైద్యం. కోసం వచ్చిన రోగులు ఎండలో క్యూలో నిలబడాల్సి వస్తుంది. పెరుగుతున్న రోగుల సంఖ్య ను బట్టి ఇటు వైద్యులు, సిబ్బంది తో పాటు సౌకర్యాలను కూడ కల్పించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయం పై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంగళ ను వివరణ కోరగా...ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సోమవారం 360 మంది ఓపీ ఉన్నట్లు తెలిపారు.



# చెరువు చెరవు ఆక్రమణ నుంచి కాపాడండి ఆక్రమణ చెర లో 200 ఎకరాలు

**నేలకొండపల్లి, ఆగస్టు 25 మహా :** మండలం లోని చెరువుమాధారం చెరువు ఆక్రమణ నుంచి కాపాడాలని మత్స్య పారిశ్రామిక సహాకార సంఘం పాలకవర్గం కోరారు. స్థానిక తహశీల్దార్ కు సోమవారం వినతి ప్రతం ను అందించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం జిల్లా కార్యదర్శి, మత్స్య సోసైటీ డైరెక్టర్ బోయిన బలరాం మాట్లాడారు... చెరువు ను పరిసర ప్రాంతాల కు చెందిన కొంత మంది దాదాపు 200 ఎకరాల ను ఆక్రమించి సాగు చేస్తున్నారని అన్నారు. 850 ఎకరాల విస్తీరణం ఉండాల్సిన చెరువు కేవలం 650 ఎకరాల మాత్రమే ఉందని పేర్కొన్నారు. చెరువు ను ఆక్రమణ నుంచి విముక్తి కల్పించాలని పలుమార్లు అధికారులను కోరినప్పటికీ పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు విస్తీరణం ను సోసైటీ కి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆక్రమించిన చెరువు ను స్వాధీనం చేసుకుని సోసైటీ కి అప్పగించాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. చెరువు హద్దులు చూపించాలని రెవిన్యూ, ఇరిగేషన్ అధికారుల ను కోరారు. జాప్యం చేస్తే సోసైటీ నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోసైటీ అధ్యక్షుడు భాసిం, ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, శేషగిరి తదితరులు పాల్గొన్నారు



## హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన హరి నాయక్



**కారేపల్లి ,మహా:** కారేపల్లి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హరి కానిస్టేబుల్ పదోన్నతిపై హెడ్ కానిస్టేబుల్ గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయ్యారు.విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పోలీస్ అధికారుల మన్ననలను పొందిన హరి 26 సంవత్సరాలుగా వివిధ పోలీస్ స్టేషన్లో పని చేశాడు. ఈ క్రమంలో ఇల్లందు పోలీస్ స్టేషన్లో ఐడి పార్టీ కానిస్టేబుల్ గా పనిచేసినప్పుడు ఎంతోమంది క్రిమినల్స్ ను పట్టుకోవడంతో ప్రశంసలు పొందాడు.తను పోలీస్ డిపార్ట్మెంట్లో ఏ విధమైన బాధ్యతలు అప్పగించినబాధ్యతాయుతంగా వ్యవహరించారు.కారేపల్లి సిఐ తిరుపతి రెడ్డి, ఎస్సై బైరు గోపి సహచర సిబ్బంది హరి నాయక్ ను అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో పోలీస్ డిపార్ట్మెంట్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## గోపాలపేటలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలి




**తల్లాడ, ఆగస్టు, 25, (మహా ):** తల్లాడ మండలంలోని గోపాలపేట గ్రామంలో రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ మాజీ సర్పంచ్, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు నల్లమోతు మోహన్ రావు, తెదేపా నాయకులు కూచిపూడి వెంకటేశ్వరావు వినతిపత్రం అందించారు. సోమవారం తల్లాడలో ప్రజావాణిలో తహశీల్దారు సురేష్ కుమార్ కు వారు వినతిని అందించారు. అదేవిధంగా ఎస్సీలకు స్మశాన వాటిక, రోడ్లు లేక అవస్థలు పడుతున్నారని, వాటిని కూడా మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేరసాని వెంకటయ్య, ఇసనపల్లి రవి, మహేష్ పాల్గొన్నారు.

## ˘ూరియా కొరత లేకుండా సరఫరా చేయాలి



**ముదిగొండ ఆగస్టు 25 మహా:** యూరియా కొరత లేకుండా రైతులకు సకాలంలో సరఫరా చేయాలని సిపిఐ మండల కార్యదర్శి రావులపాటి శ్రీనువాసరావు ప్రభుత్వాలు డిమాండ్ చేశారు. రైతులను వేధిస్తున్న యూరియా సమస్యపై సిపిఐ జిల్లా సమితి పిలుపుమేరకు సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తాహశీల్దార్ కార్యాలయంలో యుడిసి నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకొని యూరియా సరఫరా చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన విమర్శించారు. యూరియాను సకాలంలో రైతులకు అందించకపోతే రానున్న కాలంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సకాలంలో యూరియాను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు గంగాదరబాబు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**మణుగూరు, మహా:** ఖమ్మం జిల్లా మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎస్కే సైదులు సాహెబ్ ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే, సైదులు సోమవారం ఖమ్మం నగరంలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయానికి వెళ్లి తన సమస్యలను వివరించారు. డబుల్ డ్రైవర్ డ్యూటీ కారణంగా ఇబ్బందులు పడుతున్నానని, ఆరోగ్యం బాగోలేదని ఆయన ఆర్ఎంకు తెలిపారు. దీనిపై ఆర్ఎం డీఎంను సంప్రదించి కండక్టర్ సర్వీస్ ఇవ్వమని ఆదేశించారు. అయితే డీఎం సెలవులో ఉన్నందున తిరిగి వచ్చిన తరువాత మాట్లాడతానని ఆర్ఎం చెప్పడంతో సైదులు నిరాశకు గురయ్యారు. ఆర్ఎం చాంబర్ నుండి బయటకు వచ్చిన సైదులు, వెంట తెచ్చుకున్న ఎలుకల మందు తాగడానికి ప్రయత్నించారు. అక్కడి సిబ్బంది గమనించి వెంటనే ఆర్ఎంకు సమాచారం అందించారు. ఆర్ఎం స్వయంగా సైదులును ఆటోలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తక్షణ చికిత్స అందించి ఆయన ప్రాణాలను కాపాడారు. ప్రస్తుతం సైదులు ఆరోగ్యం స్థిరంగా ఉందని, ఆసుపత్రిలో ఆర్ఎం పర్యవేక్షణలో ఉన్నారని సమాచారం.

# హిందుత్వ శక్తి-ఐక్యతకు ప్రతీక వినాయక చవితి



**ఖమ్మం, మహా :** వినాయక చవితి కేవలం పూజా పర్వం కాదు, హిందుత్వ ఆత్మకు, సామాజిక ఐక్యతకు ప్రతీక" అని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. ఈనెల 27వ తేదీన వినాయక చవితి పర్వదిన సందర్భంగా ఖమ్మం లో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఘ్నేశ్వరుని ఆశీస్సులు ప్రతి శుభారంభానికి అవసరమని, ఈ పండుగ మన వ్యక్తిగత భక్తిని మాత్రమే కాకుండా సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తుందని వివరించారు. మండపాలు కేవలం పూజా వేదికలు మాత్రమే కాకుండా, సమాజం కలిసే వేదికలని స్పష్టం చేశారు. రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, అన్నదానం, విద్యార్థుల కోసం పోటీలు వంటి సేవా కార్యక్రమాలు వినాయక చవితి అసలు మహత్తును తెలియజేస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. యువత ఈ ఉత్సవాల ద్వారా సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో గణేశ ఉత్సవాలకు ఉన్న చారిత్రక ప్రాధాన్యతను గుర్తు చేసిన కోటేశ్వరరావు, బాలగంగాధర తిలక్ ప్రజలను ఏకం చేయడానికి గణేశ ఉత్సవాలను వేదికగా మార్చారని, అదే స్ఫూర్తి నేటి తరానికి అవసరమని అన్నారు. "గణపతి బప్పా మోరియా అనే నినాదం కేవలం భక్తి ఘోష మాత్రమే కాదు, ఇది మన సాంస్కృతిక గర్వం" అని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని గుర్తు చేస్తూ, మట్టి గణేశ విగ్రహాలకు ప్రాధాన్యత పెరగడం హర్షణీయమని, "ప్రకృతిని కాపాడటం కూడా గణపతి ఆశీస్సులు పొందే మార్గమే. మట్టి నుంచి పుట్టి మట్టిలో కలిసే గణేశ విగ్రహాలు నిజమైన సాంప్రదాయ ప్రతీకలు" అని పేర్కొన్నారు. నెల్లూరు వెంట బిజెపి నాయకులు నల్లగట్టు ప్రవీణ్ కుమార్, తొడుపునూరి రవీందర్ తదితరులు ఉన్నారు.

## 39 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి



**ఖమ్మం , మహా:** పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో బాధ్యతలు నిర్వహించి నిరంతరంగా సేవలందించి హెడ్ కానిస్టేబుల్ గా ఉద్యోగన్నతి పొందిన కానిస్టేబుళ్లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం పోలీస్ కమిషనర్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు. ఖమ్మం జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న 39 మంది పోలీసు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కలిపిస్తూ..22 మంది మహబూబాబాద్ జిల్లా,13 మంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఒకరు ఖమ్మం జిల్లాకు, ముగ్గురు ఇతర విభాగలకు కేటాయించి బదిలీ చేశారు. .

## ఖమ్మం జిల్లాలో మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీ




**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లా వైద్య , ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం నుంచి ఒక ముఖ్యమైన ప్రకటన వెలువడింది. జాతీయ ఆరోగ్య మిషన్ విభాగంలో కాంట్రాక్టు పద్ధతిలో నాలుగు మెడికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి కళావతి భాయ్ వెల్లడించారు. ఈ ఉద్యోగాలకు ఎంబిబిఎస్ పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ సబ్మిట్ చేసి, ఆ తర్వాత పూర్తి వివరాలతో ఆఫ్‌లైన్ దరఖాస్తు (జిరాక్స్ సర్టిఫికేట్స్‌తో పాటు) జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం, ఐడోసి, వెంకటాయపాలెం, ఖమ్మంలో సమర్పించాలి.

## ఎరువుల కొరతపై బీఆర్ఎస్ ఆందోళన

**ఇల్లందు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ఏడిఏ కార్యాలయం ముందు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు రైతుల తరఫున ఎరువుల కొరతపై నిరసన తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి హరిప్రియ నాయక్, బీఆర్ఎస్ వ్యవస్థాపక సభ్యుడు దిండిగాల రాజేందర్, కామేపల్లి కృష్ణ ప్రసాద్, దేవి లాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తప్పుడు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలలు అయినా రైతులకు కనీసం యూరియా ఎరువును కూడా సకాలంలో అందించలేకపోతుందని విమర్శించారు. రైతు సమస్యల పట్ల కాంగ్రెస్ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోందని, గత బీఆర్ఎస్ పాలనలో రైతులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదని తెలిపారు. యూరియా బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు నిజమైన ధరకు ఎరువులు అందేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఎరువుల కొరత కారణంగా ఇప్పటికే నష్టపోయిన రైతులకు ప్రత్యేక పరిహారం అందించాలని కోరారు. రైతు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తే, బీఆర్ఎస్ పార్టీ మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శీలం రమేశ్, మండల కన్వీనర్ రేణుక, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఘాజీ పాల్గొన్నారు.